కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

● దానం నాగేందర్



వెంకటేశ్వరనగర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకులు

బంజారాహిల్స్ ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వర నగర్ కాలనీ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఖైరతాబాద్‌లో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ.. సికింద్రాబాద్ గతంలో కాంగ్రెస్ కంచుకోటగా ఉండేదని, ఆ స్థానాన్ని తిరిగి దక్కించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి చరిత్ర సృష్టించిందన్నారు. కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేసిందేమీ లేదని, వారికి ఓటు వేసి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకొని కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని కోరారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్, కాంగ్రెస్ నాయకులు రాములు చౌహాన్, బాబా నాయక్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపని చేసుకునే వారికి కాంగ్రెస్ అండ

వృత్తిపని చేసుకునే వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందని దానం నాగేందర్ అన్నారు. షేక్‌పేటలో గంగపుత్ర సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు గుర్తింపు రావాలంటే అదికాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.

హస్తం గుర్తుకు ఓటేయండి

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మోండా మార్కెట్ ప్రాంతంలో దానం నాగేందర్ సోమవారం ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దానంకు 90 వేల ఓట్లే లక్ష్యంగా పనిచేయాలి

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు 90 వేల ఓట్లే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కె. గౌరీశంకర్ సూచించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, డివిజన్, బ్లాక్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ప్రతి పోలింగ్ బూత్‌లో 8 నుంచి 10 మంది సభ్యులను నియమిస్తున్నామని, ప్రతి 5 బూత్‌లకు ఒక ఇన్‌చార్జిని నియమిస్తున్నట్లు తెలిపారు. ఎం. అరవింద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. దానంను గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్, మాజీ కార్పొరేటర్లు ఆర్. కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, బ్లాక్ అధ్యక్షులు అంజియాదవ్, వి. డి. కృష్ణ, డివిజన్ అధ్యక్షులు తిరుమల్, సయ్యద్ జువేది హుస్సేన్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, అబిషేక్ కెనడీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ మోండా మార్కెట్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని వృద్ధులను అభ్యర్థిస్తున్న దానం నాగేందర్



నిరసన తెలుపుతున్న సూరజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, బస్తీవాసులు

బ్రిడ్జి పనులను అడ్డుకున్న బస్తీ వాసులు

● దారి చూపించాలని ఆందోళన

కవాడిగూడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దోమలగూడ నుంచి అశోక్‌నగర్‌ను కలిపేందుకు నిర్మించే లింక్ బ్రిడ్జి నిర్మాణం వల్ల తమ బస్తీకి దారిలేకుండా పోతుందని, దారి చూపించిన తరువాతే లింక్‌బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని కవాడిగూడ డివిజన్ సూరజ్‌నగర్ బస్తీ వాసులు సోమవారం పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బ్రిడ్జి నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, 60 ఏళ్ల నుంచి బస్తీలో నివసిస్తున్న 53 కుటుంబాలకు దారి చూపాలన్నారు.

సూరజ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల అంజయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి నాగేష్, సెక్రటరీ ఆకుల శివ, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బస్తీకి దారి చూపించకపోతే బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంట్రాక్టర్ జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపించారు.

'కులగణనపై రాహుల్‌గాంధీ ప్రకటన హర్షణీయం'

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేపడతామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించడం హర్షణీయమని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. మహేందర్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన బీసీ ఐక్యవేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత బీసీలపై ఉందన్నారు. బీసీ బిల్లుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని ఆయన కోరారు.

ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త ఎ. దశరథం మాట్లాడుతూ.. బీసీలందరూ పార్టీలకు అతీతంగా ఏకమై బీసీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజీవ్‌కుమార్, నాయకులు విష్ణువర్ధన్, శ్రీనివాస్, రవీందర్ గౌడ్, సాయిముదిరాజ్, విక్రమ్, శ్రీనుగౌడ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ గుండు చౌరస్తాలో టీజేఎస్ పతాకాన్ని ఆవిష్కరించిన ఆ పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు నర్సయ్య

ఉద్యమ ఆకాంక్షల సాధనే టీజేఎస్ లక్ష్యం

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధనే తెలంగాణ జన సమితి(టీజేఎస్) లక్ష్యం అని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య పేర్కొన్నారు. సోమవారం రాంనగర్ గుండు చౌరస్తాలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి, బడుగు, బలహీన, దళితుల, ఆదివాసీల రిజర్వేషన్లు కొనసాగించడానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, జశ్వంత్, సురేష్‌కుమార్, లక్ష్మణ్, రాజు, రసూల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

'వినియోగదారులు చైతన్యవంతులు కావాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. సోమవారం సాయంత్రం గోల్కొండ చౌరస్తాలో మండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం మంచి ఆలోచనలకు ప్రేరణ ఇచ్చిన నాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వినియోగదారులు ప్రతి వస్తువు కొనుగోలు విషయంలో చైతన్యవంతులు కావాలని సూచించారు. సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల మండలి సమన్వయకర్త పల్లెపాడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



సాయి కామరాజుకు ఉగాది కామధేను పురస్కారం బహూకరిస్తున్న సినీ హీరో సుమన్

కామరాజుకు ఉగాది కామధేను పురస్కారం

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): శోభన్‌బాబు సేవా సమితి ప్రధాన కార్యదర్శి సాయి కామరాజుకు ఉగాది కామధేను పురస్కారం బహూకరించారు. సోమవారం సాయంత్రం వంశీ తిరుమల బ్యాంకు ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఉగాది కామధేను పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. సినీ హీరో సుమన్ ముఖ్యఅతిథిగా పాల్గొని సాయికామరాజును సన్మానించి పురస్కారం ప్రదానం చేశారు. కామరాజు మాట్లాడుతూ.. పురస్కారాలు బాధ్యతను మరింత పెంచుతాయని అన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం



మాట్లాడుతున్న వినోద్‌యాదవ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి. వినోద్‌యాదవ్ బీజేపీ నాయకులకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే కాంగ్రెస్, ఇతర పార్టీలు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని, దీన్ని నమ్మవద్దని ఆయా వర్గాలను కోరారు.

సోమవారం కాచిగూడ మహేంద్ర గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత మోదీ ప్రభుత్వం కల్పించిందన్నారు. రిజర్వేషన్లను రద్దు చేయబోమన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి అచ్చిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాయదుర్గం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం ఎదుట ఆదివారం ఉదయం ద్విచక్రవాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిజర్వేషన్ల ఎత్తివేతకు బీజేపీ ప్రభుత్వం కుట్ర



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయికుమార్, నాయకులు

కవాడిగూడ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేయడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆరోపించారు. మోదీ మరొకసారి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు రద్దు చేయడమే కాకుండా భారత రాజ్యాంగాన్ని మారుస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రిజర్వేషన్లను కాపాడుకోవడానికి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే మోదీ ప్రధాని అయ్యారని, రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లపై బీజేపీ నేతలు చేసిన వాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎన్నికల ప్రచారం కోసం రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కార్యక్రమాలను అడ్డుకుంటామని సాయికుమార్ హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముషీరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జిగా సుబ్రహ్మణ్యప్రసాద్



రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జిగా సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ సోమవారం ప్రకటించారు.

సికింద్రాబాద్‌కు కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలి

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



సనత్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్

సనత్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం సనత్‌నగర్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎన్నికల ఇన్‌చార్జిలు వెంకటేశ్వరరెడ్డి, మేడే రాజీవ్ సాగర్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. డీఎన్‌ఎం కాలనీ నుంచి అశోక్ కాలనీ, వెల్ఫేర్ గ్రౌండ్, శ్యామలకుంట, ఉదయ్ నగర్ తదితర ప్రాంతాల మీదుగా 60 ఫీట్ రోడ్డు వరకు ప్రచారం కొనసాగింది. పద్మారావుగౌడ్‌కు ప్రజలు పూలమాలలతో స్వాగతం పలికారు. సనత్‌నగర్ బస్టాండ్ వద్ద పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి ఏనాడూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్, జవహర్ నగర్, గాయత్రి హిల్స్‌లో పద్మారావుగౌడ్ సోమవారం పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు.

పద్మారావుకు మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

ముషీరాబాద్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా సోమవారం బోలక్‌పూర్, రాంనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌లో అభివృద్ధి పనులు చేయలేదని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు కిషన్‌రెడ్డి, దానం నాగేందర్‌ను ఓడించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు



నాట్య ప్రదర్శనలిచ్చిన కళాకారులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నాట్య సంస్థ కథక్ కళా క్షేత్ర ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో అంతర్జాతీయ నాట్య దినోత్సవం సందర్భంగా భిన్న నాట్య ప్రక్రియల సమాహారంగా ప్రదర్శనలు ఆకట్టుకునేలా జరిగాయి. యోగిని తన శిష్యబృందంతో కథక్, శాస్మిత మిశ్రా ఒడిస్సీ, లక్ష్మీప్రసూన మోహిని ఆట్టం, లలితవినోద్ శిష్యబృందంతో భరతనాట్యప్రదర్శన, మృణాళిని శిష్యబృందంతో కూచిపూడి నాట్యం, పేరిణి ప్రకాష్ శిష్యబృందం పేరిణి నాట్యం, రాజేశ్వరి శిష్యబృందం కథాకళి, మణిపురి నాట్యాలు నయన మనోహరంగా ప్రదర్శించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పణవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కూచిపూడి డాన్స్ డైరెక్టర్ డా. పద్మజారెడ్డి మాట్లాడుతూ.. కథక్ అంజుబాబు 1999లో నగరంలో ప్రారంభించిన అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని 25 ఏళ్లుగా ప్రతియేటా ఏప్రిల్ 29న నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. అధ్యక్షత వహించిన సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. పండిట్ అంజుబాబు కథక్ కళాకారుడుగా, గురువుగా ఉండి ఇతరనాట్య ప్రక్రియలు, ఆయా కళారూపాల కళాకారులకు వేదిక కల్పించడం అభినందనీయమన్నారు.

ప్రచారంపై సమీక్ష

లోక్‌సభ ఎన్నికల ప్రచారంపై బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మాజీ గవర్నర్, తమిళనాడులో ఎంపీగా పోటీ చేస్తున్న తమిళిసై సౌందరరాజన్, బీజేపీ కార్యదర్శి చంద్రశేఖర్, మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె. గీతామూర్తి తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి



మహిళను బెదిరించి రూ. 18.50 లక్షలు స్వాహా

హైదరాబాద్ సిటీ/హిమాయత్‌నగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను బెదిరించిన సైబర్ నేరగాడు రూ.18.50 లక్షలు కాజేశాడు. నగరానికి చెందిన ఓ మహిళ(51)కు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. 'డీహెచ్‌ఎల్ కొరియర్ ముంబై నుంచి ఫోన్ చేస్తున్నామని, మీకు చైనా నుంచి వచ్చిన పార్శిల్‌లో డెబిట్ కార్డులు, పాస్‌పోర్టులు, ఎండీఎంఏ డ్రగ్ ఉనాయి' అని చెప్పారు. నిమిషాల వ్యవధిలో పోలీస్ అధికారి డీపీ ఉన్న వాట్సాప్ నంబర్ నుంచి సైబర్‌నేరగాడు వీడియో కాల్ చేశాడు.

తాను ముంబై క్రైంబ్రాంచ్ అధికారినని పరిచయం చేసుకున్నాడు. 'మీకు వచ్చిన పార్శిల్‌లో ఎండీఎంఏ ఉంది.. మీపై కేసు నమోదైంది' అని చెప్పి భయపెట్టాడు. ఆమె ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించాడు. 'మీ ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఖాతాల ద్వారా విదేశాలకు అక్రమంగా డబ్బు తరలించిన కేసు కూడా నమోదైంది' అని చెప్పాడు. భయపడిన మహిళ డబ్బు అక్రమరవాణా, డ్రగ్స్‌కు తనకు ఎలాంటి సంబంధమూ లేదని, తనను కేసు నుంచి కాపాడాలని కోరింది. 'మీ ఇతర ఖాతాల్లో ఉన్న డబ్బు స్కాన్ చేయాలి' అని చెప్పాడు. అతడి సూచనల మేరకు మహిళ ఇతర ఖాతాల్లో ఉన్న డబ్బును ఒకే ఖాతాలోకి వేసి, ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను సైబర్ నేరగాడికి ఇచ్చింది. వీటి సాయంతో మహిళ ఖాతా నుంచి రూ. 18.50 లక్షలు కాజేశాడు. మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ. 6.72 లక్షలు..

పార్ట్‌టైం జాబ్ ద్వారా నెలకు లక్షల రూపాయలు సంపాదించవచ్చని నమ్మించిన సైబర్ నేగరాళ్లు నగరవాసి నుంచి రూ.6.72 లక్షలు కాజేశారు. సోషల్‌మీడియాలో ప్రచారం చేసుకున్న సైబర్ నేరగాళ్లు బాధితుడిని మహీంద్రా డెవలపర్స్ వెబ్‌సైట్‌లో చేర్చారు. పెట్టుబడి పెట్టి టాస్కులు చేస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చేసి, టాస్కులు పూర్తి చేసినందుకు రూ. 16,500 ఇచ్చారు. నమ్మకం కుదరడంతో సైబర్ నేరగాళ్లు సూచించిన విధంగా రూ. 6.72 లక్షలు డిపాజిట్ చేశాడు. తర్వాత లాభాలు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పబ్‌లో వెయిటర్‌పై బౌన్సర్ దాడి

రాయదుర్గం, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పబ్‌లో వెయిటర్‌పై బౌన్సర్ దాడి చేశాడు. గచ్చిబౌలిలో ఓ పబ్‌లో గోల్కొండకు చెందిన మసూద్ అహ్మద్ ఫారుఖీ బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. అదే పబ్‌లో హృతిక్ వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హోటల్‌కు వచ్చిన విజిటర్ ఫుడ్ బాగోలేదు.. మార్చాలని బౌన్సర్ ఫారూఖీకి చెప్పాడు. అతడు వెయిటర్ వద్దకు వెళ్లి విషయం చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. దీంతో బౌన్సర్ హృతిక్‌పై దాడి చేశాడు. అతడు బంధువులకు ఫోన్‌చేయగా సుమారు 8 మంది పబ్‌కు వచ్చి బౌన్సర్‌పై దాడిచేశారు. ఫారూఖీ కస్టమర్ల ట్యాగ్‌కట్ చేసే కత్తితో హృతిక్ బంధువులపై దాడిచేయగా అనిల్, మల్లికార్జున్ గాయపడ్డారు. వారి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాగ్‌లింగంపల్లి భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

'డబుల్' ఇళ్లు ఇస్తేనే ఓటు వేస్తాం

● భగత్‌సింగ్‌నగర్‌లో స్థానికులు ఫ్లెక్సీల ఏర్పాటు

రాంనగర్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని సుందరయ్య పార్కు సమీపంలోగల భగత్‌సింగ్‌నగర్ హట్స్ వాసులు పోరాటం చేస్తున్నా వారి డిమాండ్ నెరవేరలేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఇళ్ల ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తమ డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చిన వారికే లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని చెబుతున్నారు. సోమవారం సాయంత్రం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు 'డబుల్' ఇళ్లు ఇస్తేనే ఓటు వేస్తామని చెప్పారు.

ఫ్లైఓవర్ పనులను కిషన్‌రెడ్డి పట్టించుకోవడం లేదంటూ..

శ్రీరమణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుల నిరసన

అంబర్‌పేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది సంవత్సరాల నుంచి అంబర్‌పేట నియోజకవర్గంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి పట్టించుకోకపోవడం శోచనీయమని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. సోమవారం శ్రీరమణ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తికాకపోవడం వల్ల పరిసర ప్రాంతాలలో నివసించే వారు దుమ్ము, ధూళితో బాధపడుతూ అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కోటం అనిల్‌కుమార్, రావుల సుధాకర్, రాజ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ ఆర్ట్ క్యాంపు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సాలార్‌జంగ్ మ్యూజియంలో మే 14 నుంచి మే 28 వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్యాంప్‌లో 8 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సుగల విద్యార్థులు పాల్గొనవచ్చు. దరఖాస్తులను మ్యూజియం రిసెప్షన్ కౌంటర్‌లో మే 5 వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు మే 6న వెల్లడిస్తామని, రూ.1000 ఫీజుతో యోగా, డ్రాయింగ్, పెయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, మట్టి బొమ్మలు, కుండల తయారీ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.

జవహర్ బాలభవన్‌లో..

పబ్లిక్ గార్డెన్‌లో జవహర్ బాలభవన్‌లో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు భరతనాట్యం, కూచిపూడి, కథక్, శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, తబల, వీణ, మృదంగం, డ్రాయింగ్, పెయింటింగ్, కరాటే, చెస్, క్యారమ్స్, టేబుల్ టెన్నిస్‌లలో శిక్షణ ఇస్తారు. ఆసక్తి గల విద్యార్థులు జవహర్ బాలభవన్‌లో సంప్రదించాలని కోరారు.